క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: మినీ అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ రంగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం మినీ అంగన్‌వాడీ 5 పోస్టులకుగాను రాజుగాడిగూడ, గురండి, పెద్దబగ్గ, చిన్నబగ్గ, కోడిపిల్లలుగూడ, హెల్పర్ పోస్టులకుగాను గుమ్మడ, కిరప, చిన్నకంబ, శిలిగాం, చిన్నపల్లంకి, తొత్తడి, కొడగండి ఖాళీగా ఉన్నాయన్నారు. వీటన్నింటికి ఈ నెల 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పక్కాగా ఓటర్ల జాబితా

సీతంపేట: ఓటర్ల జాబితా పక్కాగా తయారు చేస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి తెలిపారు. స్థానిక ఐటీడీఏలో వివిధ పార్టీల రాజకీయ నాయకులతో ఓటర్ల జాబితాపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి ఓట్లు తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వలస ఓటర్లను కూడా విచారణ చేపట్టి తొలగిస్తున్నామన్నారు. మృతి చెందిన వారి ఓట్లను ఇప్పటికే తొలగించామన్నారు. కొత్త ఓటరు నమోదు ప్రక్రియ చేపడుతున్నామన్నారు.

అప్రమత్తం అవసరం



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పలరాజు

బలిజిపేట: తుఫాన్ ప్రభావంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా అందరినీ అప్రమత్తం చేయాలని తహసీల్దార్ అప్పలరాజు సూచించారు. ఈ మేరకు బలిజిపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మండల అధికారులతో రివ్యూ నిర్వహించారు. పాఠశాలల వద్ద అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంఈఓ సామల సింహాచలానికి సూచించారు. అదేవిధంగా పాఠశాలలను ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు నిర్వహించాలని చెప్పారు. నారాయణపురం సువర్ణముఖి, వేగావతి నదుల ప్రవాహం, ఉద్ధృతి ఎంతమేరకు ఉన్నాయనే అంశంపై సమావేశంలో ఆరాతీశారు. పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని కోరారు.

నష్టపోయిన పంటల వివరాలు ఇవ్వాలి



మండల స్థాయి అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

మక్కువ: మిచాంగ్ తుఫాన్‌పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటల వివరాలు అందించాలని కోరారు. ముంపు బారిన పడితే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామ, వార్డు, వలంటీర్లు మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని గుర్తించాలని చెప్పారు. అనంతరం లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీడీఓ సూర్యనారాయణ, దేవకుమార్, హౌసింగ్ ఏఈ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ సమావేశం

పార్వతీపురంటౌన్: ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం పార్వతీపురం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెవెన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఫారం-6లో చేర్పులు, ఫారం-7లో తొలగింపులు, ఫారం-8లో మార్పులకు సంబంధించి 3,676 ఫారాలు వచ్చాయని తెలిపారు. వాటిలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తక్షణమే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచితంగా బ్రెయిన్ సర్జరీ

విజయనగరం ఫోర్ట్: సాయి ఆస్పత్రిలో విజయవంతంగా బ్రెయిన్ సర్జరీని వైద్యులు చేశారు. ఈ మేరకు డాక్టర్ శ్రీరామ్మూర్తి వివరాలు వెల్లడించారు. చీపురుపల్లి మండలం వంగపల్లిపేటకు చెందిన రమేష్ అనే యువకుడికి తలలో రక్తం గడ్డం కట్టడంతో వారి బంధువులు విజయనగరంలోని సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. అతనికి విశాఖ కేజీహెచ్ డాక్టర్ నాయక్ సాయి ఆస్పత్రిలో విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆస్పత్రిలో చేరే సమయంలో అతను కోమా లో ఉన్నాడని, శస్త్రచికిత్స తర్వాత అతను కోలుకున్నాడని చెప్పారు. రూ.3 లక్షల వరకు ఈ శస్త్రచికిత్సకు ఖర్చవుతుందని, సాయి ట్రస్టు ద్వారా ఉచితంగా చేశామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ నాయక్, అక్కెన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మిచాంగ్‌తో ముందస్తు చర్యలు



గొయిది గెడ్డ వద్ద జేసీబీతో పనులు చేయిస్తున్న సిబ్బంది

సీతంపేట: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మండల అధికారులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారిలో ఉన్న గొయిది గెడ్డ రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు చేపట్టారు. జేసీబీతో గెడ్డను లోతు చేస్తూ తుప్పలు, డొంకలు, పిచ్చిమొక్కలను తొలగించారు. ఎంపీడీఓ కె.గీతాంజలి, తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి, ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమీక్ష



తుఫాన్ ప్రభావంపై తహసీల్దార్ సత్యనారాయణతో మాట్లాడుతున్న ఆర్అండ్‌బీ డీఈ గౌరీశంకరరావు

వీరఘట్టం: మండలంలో తుఫాన్ ప్రభావంపై ఆర్అండ్‌బీ డీఈ గౌరీశంకరరావు, తహసీల్దార్ చందక సత్యన్నారాయణతో మంగళవారం సమీక్షించారు. తుఫాన్ ప్రభావం వల్ల ఏమైనా నష్టం జరిగిందా.. లేదా.. అని చర్చించారు. మంగళవారం వరకు ఎటువంటి నష్టం జరగలేదని తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుతం ఆర్అండ్‌బీ సిబ్బంది జేసీబీలతో సిద్ధంగా ఉన్నామని ఎటువంటి సమస్య వచ్చినా తెలియజేయాలని డీఈ కోరారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటుకు పరిశీలన



భామిని: బిల్లుమడలో ఇటుకుల బట్టీలకు రక్షణ కల్పించిన రైతులు

భామిని:

మండలంలో మిచాంగ్ తుఫాన్ తాకిడితో నిరాశ్రయులైన ప్రజలకు ఆదుకోవడానికి పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి మంగళవారం పరిశీలన జరిపారు. భామిని, బాలేరు హైస్కూల్ భవనాలను కార్యదర్శులు విశ్వేశ్వరరావు, సత్యవతిలతో కలిసి పరిశీలించి అందుబాటులోకి తెచ్చారు. బాలేరు, సొలికిరి, నల్లరాయిగూడ గ్రామాల్లో పర్యటించి తుఫాన్ ప్రభావంపై గ్రామస్తులకు హెచ్చరికలు చేశారు. నదీతీర ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ వైర్ల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.

14, 15 తేదీల్లో ఆశ వర్కర్ల ఆందోళన



వైద్యాధికారికి డిమాండ్ల పత్రాన్ని అందజేస్తున్న ఆశ కార్యకర్తలు, ఆ సంఘ నాయకులు

పాలకొండ రూరల్: తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14, 15 తేదీల్లో 36 గంటల ధర్నా చేపట్టనున్నట్టు ఆ సంఘం జిల్లా కమిటీ నాయకురాలు కె.గౌరీశ్వరి తెలిపారు. మంగళవారం తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ వినతిపత్రాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారికి అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కనీస వేతనం పెంచాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని కోరారు. మొబైల్ వర్క్‌పై శిక్షణ అందించాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సురెన్స్ సౌకర్యం, రిటైర్మెంట్ రాయితీలు వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద తలపెట్టిన 36 గంటల ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు అండగా ప్రభుత్వం



ఆఫ్‌లైన్ విధానంలో ధాన్యం మిల్లులకు తరలిస్తున్న అధికారులు

పాలకొండ: తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు నష్టం కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంది. ముందుగానే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం ద్వారా వరి పంటలకు ఎక్కడ నష్టం వాటిల్లలేదు. ముందుగానే వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి కోత వేసిన పంటలను కుప్పలుగా వేయించడంలో రైతులకు అవగాహన కలిగించారు. దీనితో పాటు అప్పటికే నూర్పులు చేసిన ధాన్యాన్ని అధికారులు దగ్గర ఉండి ఆఫ్‌లైన్ విధానంలో మిల్లులకు తరలించారు. మండలంలోని వాటపాగు, నవగాం తదితర గ్రామాల నుంచి నూర్పులు చేసిన ధాన్యం అందుబాటులో ఉన్న రైసు మిల్లులకు తరలించి రైతులకు నష్టం లేకుండా చర్యలు తీసుకున్నారు. గత రెండు రోజులుగా తుఫాన్ కారణంగా మండలంలో తేలికపాటి వర్షం మాత్రమే కురిసింది.

గ్రామాల్లో క్లోరినేషన్



కాశీపేటలోని బావిలో క్లోరినేషన్ చేయిస్తున్న వైద్య, పీఆర్ సిబ్బంది

సీతానగరం: రెండు రోజులుగా కురుస్తున్న తుఫాన్ వర్షాల కారణంగా తాగునీటి సరఫరాలో కాలుష్య నివారణకు మండలంలోని గ్రామాల్లో గల బావులు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల్లో క్లోరినేషన్, పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం కాశీపేట, లచ్చయ్యపేట గ్రామాల్లో వైద్యారోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు చేయిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చిరుజల్లులతో కూడిన వర్షాలకు తాగునీరు కలుషితమయ్యే ఆస్కారం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా బావులు, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసినట్లు చెప్పారు. అలాగే వీధుల్లో చెత్త పేరుకుపోతున్న కారణంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల వైద్యసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తవలస డ్యామ్ సందర్శన



కొత్తవలస డ్యామ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్వీరమణ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కుమారవర్మ

సీతానగరం: 'మిచాంగ్ తుఫాన్' కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు మండలంలోని సువర్ణముఖినదిపై ఉన్న కొత్తవలస డ్యాం వద్ద నీటి సామర్థ్యం, ప్రజల రాకపోకలను తహసీల్దార్ ఎన్వీ రమణతో కలిపి ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్యామ్ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో పాటు మండలస్థాయి అధికారులతో కలిసి డ్యామ్‌ను పరిశీలించామన్నారు. ప్రస్తుతానికి నదిలో నీరు నిలకడగా ప్రవహిస్తోందని చెప్పారు. నీటి ప్రవాహం పెరుగుతున్నందున ప్రజలు, రైతులు, గొర్రెల పెంపకం దారులు డ్యామ్ మీదుగా రాకపోకలను నిలిపివేయాలని కోరారు.

కొత్తవలస, బగ్గందొరవలస గ్రామాల పంచాయతీ, రెవెన్యూ, గ్రామ వలంటీర్లు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాకపోకలు చేయవద్దని ప్రజలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శులు, ఆర్బీకే, పశుసంవర్ధక శాఖ సహాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, సంకిలి, బూరాడ తదితర కూడళ్ల వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు, సిబ్బంది కలిసి అటువైపుగా వస్తున్న వాహనాలు నిలిపి, లైసెన్స్, ఆర్‌సీ, పొల్యూషన్ ధ్రువపత్రాలు పరిశీలించడంతో పాటు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్లు



బ్యానర్ డిస్‌ప్లే చేస్తున్న ఎంపీడీఓ తదితరులు

సీతంపేట: ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్లు ఉత్సాహంగా జరుగుతున్నాయని ఎంపీడీఓ కె.గీతాంజలి తెలిపారు. ఈ మేరకు గొయిదిలో ఈ క్రీడలకు సంబంధించి బ్యానర్ డిస్‌ప్లే చేశారు. గ్రామ వలంటీర్ మొబైల్‌లో కూడా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. అలాగే కుడ్డపలి సచివాలయంలో కూడా బ్యానర్ డిస్‌ప్లే చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

రామభద్రపురం: గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు సిబ్బంది, వీవోలతో మంగళవారం సమావేశమైన ఆయన రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజల్లో జీవన ప్రమాణాలు పెంపొందిస్తోందన్నారు. పొదుపు సంఘాల కమిటీ సభ్యులు, అధికారుల సమన్వయంతో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: నియోజకవర్గ కేంద్రమైన బొబ్బిలిలో ఈ నెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాబ్‌మేళాపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్వాన్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు జరిగే జాబ్‌మేళాకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ నీలిమ, ఎంపీడీవో కార్యాలయ ఏవో డీవీ అప్పారావు ఉన్నారు.

10న ఘంటసాల పాటల పోటీలు

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 10వ తేదీన ఘంటసాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మింది విజయమోహన్ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు 20 మంది గాయనీగాయకులతో పాటల కచేరీ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు పోటీలో పాల్గొనేందుకు ఈ నెల 7వ తేదీలోగా తమ పేర్లను ఫోన్ నంబర్ 9440744741 ద్వారా సంప్రదించాలన్నారు.

సక్రమంగా కుల గణన



వార్డు సచివాలయాల అడ్మిన్‌లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం: సక్రమంగా కుల గణన చేయాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయాల అడ్మిన్‌లతో సమావేశమైన ఆయన కుల గణన నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి, సమగ్రంగా వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన



ఆస్పత్రిలో వైద్యులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: పేదలకు మెరుగైన వైద్యం అందించడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కళావతి అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం మంగళవారం ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగానికి ప్రాధాన్యత కల్పించి వైద్య విధానంలో మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల ముగింటకే వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వసతులు కల్పిస్తున్నారని వివరించారు. వైద్యులు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వ ఆశయం నెరవేరేలా పని చేయాలని సూచించారు. ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా భర్తీ చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కిందన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి రోగులకు ఆదుకుంటుందని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతను పర్యవేక్షించాలి



గోపాలపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షం కారణంగా మండల వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య భద్రతను పర్యవేక్షించాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. గోపాలపురం, వెలగవాడ, సిరికొండ, సింగన్నవలస, పరుశురాంపురం తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. అక్కడి సచివాయాల సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. తుఫాన్ కారణంగా ఏర్పడ్డ నష్టాలపై ఆరా తీశారు. పంట, ఆస్తి, ఎటువంటి ప్రాణనష్టం లేదని నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో వాతావరణ మార్పుల కారణంగా సంక్రమించే వ్యాధుల బారిన గ్రామీణులు పడకుండా తగుచర్యలు చేపట్టాలన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు, సలహాలు స్వీకరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జియ్యమ్మవలస: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో కె.విజయలక్ష్మి ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. చినబుడ్డిడిలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు(ఓసీ), పెదమేరంగి-2లో ఓ ఆయా పోస్టు(ఓసీ ఈడబ్ల్యూఎస్), అర్నాడలో మరో పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులన్నారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు.

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారిణి కె.విజయగౌరి తెలిపారు. చినబుడ్డిడి, సంగెడ్డ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, పెదమేరంగి-2, కై రాడ, అర్నాడా, పాక్కిరి గ్రామాల్లో అంగన్‌వాడీ ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నేరుగా గానీ, పోస్టు ద్వారా ఐసీడీఎస్ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం తర్వాత తెలియజేస్తామన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో సుశీల దేవి తెలిపారు. లిక్కిడి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు, వండిడి అంగన్‌వాడీ కేంద్రంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులున్నాయని, ఆయా పోస్టులు ఎస్టీ వారికి కేటాయించడం జరిగిందన్నారు. ఈ నెల 6 నుంచి 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, వివాహితులై స్థానికంగా నివాసం చెంది ఉండాలని, 01.07.2023 నాటికి 21 సంవత్సరాలు నిండాలన్నారు.

ఆఫ్‌లైన్‌లో సేకరించిన ధాన్యాన్ని ఆన్‌లైన్ చేయాలి

- జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు



ధాన్యం తరలింపుపై మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రోణంకి గోవిందరావు

సీతానగరం: మిచాంగ్ తుఫాన్ వల్ల పార్వతీపురం మన్యం జిల్లాలోని రైతుభరోసా కేంద్రాలలో ఆఫ్‌లైన్ ద్వారా నిర్వాహకులు సేకరించిన ధాన్యాన్ని ఆన్‌లైన్ చేసే పనుల్లో వ్యవసాయ అధికార సిబ్బంది ఉండాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోవిందరావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీతానగరం మండలం పెదంకలాం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం సేకరణపైన, తుఫాన్ ప్రభావిత గ్రామాలను సమీక్షించారు. ఈ సందర్భంగా తుఫాన్ తీవ్రత దృష్ట్యా యుద్ధప్రాతిపదికన మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు తెలుసుకున్నారు. రైతులు బిల్లుల కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆఫ్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం బిల్లులు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈక్రాప్ బుకింగ్ చేసిన పంటనే కొనుగోలు చేయాలని తెలియజేశారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ దేవుళ్ల నాయక్ మాట్లాడుతూ మండలం నుంచి 18.700 క్వింటాళ్ల ధాన్యం మిల్లులకు తరలించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బలగ రమణమ్మ, తహసీల్దార్ ఎన్వీ రమణ, ఏఓ ఎస్.అవినాష్, సర్పంచ్‌లు జి.అన్నంనాయుడు, బి.శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకులు, టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

సీతానగరంలో ఆర్డీఓ పర్యటన



సహాయపునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కె.హేమలత

సీతానగరం: ఎటువంటి విపత్తులు వచ్చినా బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ముందుజాగ్రత్త చర్యగా సీతానగరం మండలంలో సహాయ పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ కె.హేమలత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె సీతానగరం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన అనంతరం మండలకేంద్రంలోని ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో గుర్తించిన సహాయ పునరావాస భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి విపత్తుల్లోనైనా చిక్కుకునే ప్రజలకు మండలంలో సహాయపునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వుల మేరకు స్థానిక ప్రాథమిక పాఠశాల భవనాలను గుర్తించామన్నారు. గతంలో తుఫాన్ సమయంలో సువర్ణముఖినదిలో నీరు ఉద్ధృతంగా ప్రవహించి నదీతీరాన ఉన్న ఇళ్లల్లోకి నీరు చేరిన సమయంలో ప్రాథమిక పాఠశాలలో సహాయ పునరావాసం కల్పించినట్లు గుర్తుచేశారు. తాజాగా 'మిచాంగ్' తుఫాన్ రావడంతో ముందు జాగ్రత్తచర్యలు తీసుకున్నామన్నారు. కళ్లాల్లో నిల్వలున్న ధాన్యాన్ని రెండు రోజుల పాటు మిల్లులకు తరలించి రైతులను ఆదుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, వీఆర్వో పైల కుమార్‌నాయుడు, వైద్యసిబ్బందికి ఆర్డీఓ హేమలత పలు సూచనలు చేశారు.